క్లుప్తంగా

విత్తనశుద్ధితో నాణ్యమైన దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సేద్యం సిబ్బంది

మెరకముడిదాం: వరి పంటను సాగు చేస్తున్న రైతులు వరినారును బీజామృతంతో శుద్ధి చేసి నాటుకుంటే నాణ్యమైన దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఏరియా కోఆర్డినేటర్ సూర్యకుమారి తెలిపారు. మండలంలోని యాడికలో శంకరరావు పొలంలో ప్రకృతి సేద్యంలో భాగంగా వరినారును బీజామృతంతో శుద్ధి చేసి, ఎలా నాటుకోవాలో వివరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్ల బెడద ఉండదని చెప్పారు. కార్యక్రమంలో పాచిపెంట శివ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పరామర్శ..



ఆదినారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేవీ సూర్యనారాయణరాజు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన సామంతల ఆదినారాయణ రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దుర్వాసనతో ఇక్కట్లు



లింగాలవలసలో నిలిచిపోతున్న మురుగు నీరు

గజపతినగరం: మండలంలోని లింగాలవలస గ్రామంలో కాలువలు అస్తవ్యస్తంగా ఉండడంతో దుర్వాసన వస్తోందని ప్రజలు చెబుతున్నారు. మూడు నెలల కిందట చేపట్టిన రోడ్డ వెడల్పు పనుల్లో భాగంగా కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో మురుగునీరు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. అలాగే ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువలను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గజపతినగరంలో భారీ వర్షం..



పురిటిపెంట బాలాజీనగర్ రోడ్డులో ప్రవహిస్తున్న నీరు

గజపతినగరం: మండల కేంద్రంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో గజపతినగరం – మెంటాడ కూడలి, పురిటిపెంట బాలాజీ నగర్ కాలనీలో భారీగా నీరు నిలిచిపోయింది. కాలువలు సక్రమంగా లేకపోవడంతో రోడ్ల పైనే నీరు నిలిచిపోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ భగవద్గీత



గృహస్తులకు భగవద్గీత పుస్తకాలు ఇస్తున్న కోటేశ్వరరావు, భాస్కరశర్మ, తదితరులు

శృంగవరపుకోట: భగవద్గీత పఠనం ప్రతి భారతీయుని కర్తవ్యం అన్న కార్యక్రమాన్ని పట్టణంలో స్థానిక మోక్షవిద్య యోగా మందిర్ నిర్వాహకులు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ భగవద్గీత చేర్చాలన్న లక్ష్యంతో శీలా కోటేశ్వరరావు నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దాతల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పుస్తకాలు కావాల్సిన వారు 99893 68781, 98667 57311 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంస్కృత పండితుడు వి.భాస్కరశర్మ,యోగా మందిర్ అధ్యక్షుడు ధార్రాజు, ఉప కార్యదర్శి కిషోర్, కోశాధికారి పెదకాపు, అప్పారావు, శ్రీహరి, ప్రసాద్, ఉదయ్, మణికంఠ, హరీష్, రాజేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు



బక్కునాయుడుపేటలో వరినాట్లు వేస్తున్న మహిళలు

వేపాడ మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా వరినాట్లు జరుగుతున్నాయి. బల్లంకి, బానాది, బక్కునాయుడుపేట, వీలుపర్తి, భర్తవానిపాలెం గ్రామాల్లో వరినాట్లు వేసే పనిలో వ్యవసాయ కార్మికులు, రైతులు బిజీగా ఉన్నారు. వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట కరకవలస, చామలాపల్లి, వావిలపాడు, నల్లబిల్లి, తదితర గ్రామాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉంటే వేపాడ, ఆకులసీతంపేట, వల్లంపూడి, తదితర గ్రామాల్లో వెదలు జల్లుతున్నారు. మండలంలో సుమారు 3657 హెక్టార్లలో వరి పంట సాగు జరగనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. – వేపాడ



భర్తవానిపాలెంలో ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న రైతులు

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి సర్వం సిద్ధం



వి.గ్రాండ్ ఫంక్షన్ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన టెంట్లు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలోని వి.గ్రాండ్ ఫంక్షన్ హాల్ ఆవరణంలో సోమవారం ఉదయం 10 గంటలకు జరగనున్న వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి సర్వం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తోంది. ఈ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమం పేరుతో చంద్రబాబు మోసాలను ఎండగట్టనున్నారు. గరివిడిలో జరగనున్న నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్ష/డు మజ్జి శ్రీనువాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్లమెంటరీ పరిశీలకుడు కిల్లి సత్యనారాయణతో పాటు జిల్లాలో గల నాయకులు హాజరవుతారు. ఈ సమావేశంలో చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధానం , వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న వ్యూహాలు, కార్యాచరణ, తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

కల్వర్టు ఎప్పుడు నిర్మిస్తారు..!



కృష్ణారాయుడుపేట సమీపంలో రైవాడ కాలువపై శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట సమీపంలోని రైవాడ కాలువపై కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఆనందపురం నుంచి కొత్తవలస వెళ్లే ప్రధాన రహదారిలో కృష్ణారాయుడుపేట వద్ద రైవాడ కాలువపై ఉన్న కల్వర్టు శిథిలమైపోవడంతో అధికారులు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు గాని, కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం వందలాది లారీలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తాయని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ప్రమాదం జరగక ముందే కల్వర్టు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష

చీపురుపల్లి: కృష్ణా జిల్లా గుడివాడలో జెడ్పీ చైర్పర్సన్ ఉప్పల హారికపై దౌర్జన్యం చేసిన టీడీపీ, జనసేన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారత రాజ్యాంగం కాకుండా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రౌడీలు, గూండాలకు కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల బీసీ మహిళగా హారిక జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారని చెప్పారు. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక ఆమె కారును ధ్వంసం చేయడమే కాకుండా అసభ్యకరంగా మాట్లాడుతూ అవమానపరచడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో మహిళల మీద జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలపై ప్రజా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, విజ్ఞానవంతులు ఖండించాలని ఆమె కోరారు.

స్నేహితులకు 'స్నేహ' సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన సభ్యులను సన్మానిస్తున్న 'స్నేహ' సభ్యులు

శృంగవరపుకోట: స్నేహ సంస్థలో సభ్యులుగా, సహచరులుగా ఉన్న మిత్రులు పదవీ విరమణ చేయడంతో వారిని 'స్నేహ' స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయుడు బులుసు భాస్కరరావు, ఎల్ఐసీ ఉద్యోగి సీహెచ్ శ్రీనివాసరావులను కుటుంబ సమేతంగా సన్మానించారు. 'స్నేహ' అధ్యక్షుడు ఏఎస్ వెంకటరావు, ఉపాధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి మంథా సుబ్బారావు, డాక్టర్ వరలక్ష్మి, మళ్ల రామకృష్ణ, ఎంఎస్ఎన్ మూర్తి, బీఎస్ నాయుడు, తదితరులు మాట్లాడుతూ.. సన్మానగ్రహీతలతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఉద్యోగంలో వారు అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో స్నేహ సంస్థ సభ్యులు పలువురు హాజరయ్యారు.

బల్లంకిలో పశువుల పండగ



ఆలయానికి పశువులతో చేరుకున్న గ్రామస్తులు

వేపాడ: మండలంలోని బల్లంకిలో ఆదివారం మధ్యాహ్నం పశువుల పండగ వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ వరలక్ష్మీకనకరాజు, ఉప సర్పంచ్ ధనంజయ్, గ్రామ పెద్దల నేతృత్వంలో పశువులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకుని వచ్చి పూజలు చేశారు. పంటలు బాగా పండాలని.. పశువులు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ప్రతి ఏటా అమ్మవారికి పూజలు చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ కో ఆర్డినేటర్ జోగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకేంద్రం ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో చేపట్టనున్న శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కల పంపిణీ



మొక్కలు అందిస్తున్న జియో సభ్యులు

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తున్న స్థానిక 'జియో' స్వచ్ఛంద సంస్థ అరుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆదివారం ఉచితంగా మొక్కలు అందజేసింది. కార్యక్రమంలో జియో సభ్యులతో పాటూ కళాశాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నియామకం..



కె.రమణపాత్రుడు

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మండలంలోని ఎర్రవానిపాలెం గ్రామానికి చెందిన కంటిరెడ్డి రమణపాత్రుడును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రమణప్రాత్రుడు ప్రస్తుతం విశాఖపట్నం ఈస్ట్ నియోజకవర్గంలో పార్టీకి సేవలు అందిస్తున్నారు. తనకు పార్టీ పదవి వరించేందుకు సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రమణపాత్రుడి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

శాకంబరిగా కనక మహాలక్ష్మి



శాకంబరి అలంకరణలో కనక మహాలక్ష్మి

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఆషాఢ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కూరగాయలతో అలంకరణ..

ఆషాఢమాసం సందర్భంగా కొట్టాం గ్రామంలో కోటమ్మతల్లిని ఆదివారం కూరగాయలతో శాకంబరిగీ అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.
– శృంగవరపుకోట



ఘనంగా మాజీ ఎమ్మెల్యే కడుబండి జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కొత్తవలస మండల నాయకులు

కొత్తవలస: మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కవరపుకోట, కొత్తవలస, ఎస్.కోట, జామి, వేపాడ, గజపతినగరం మండలాల నుంచి పెద్దెత్తున అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై కడుబండికి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎల్.కోట మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు కడుబండికి భారీ గజమాల వేసి అభిమానాన్ని చాటుకున్నారు కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, సబ్బవరపు అరుణ, నీలంశెట్టి గోపెమ్మ, దొగ్గ సత్యవంతుడు, ఐదు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు వేచలపు చిన్నరామునాయుడు, గొరపల్లి శివ, పల్లా భీష్మ, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.



కడుబండి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జామి, ఎస్.కోట మండల నాయకులు

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు



శిథిలావస్థకు చేరుకున్న వ్యవసాయ శాఖ కార్యాలయం



అధ్వానస్థితిలో పశువైద్య కేంద్ర భవనం

జామి: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రమైన జామిలో వ్యవసాయ కార్యాలయం, పశువైద్య కేంద్రం భవనాలు పడిపోయే స్థితిలో ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో స్థానిక రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది విధులు నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శిథిల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

జిందాల్ దందాలపై విచారణేదీ..?



నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ చేస్తున్న దందాలు, అరాచకాలు, అవినీతిపై విచారణ చేసేందుకు జిల్లా అధికారులు కనీస ప్రయత్నం చేయడం లేదని సీపీఎం నాయకుడు జగన్ ఆరోపించారు. ఈ మేరకు బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులతో కలిసి ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. జిందాల్ ప్రతినిధులు కొందరు నిర్వాసితుల్ని కలిసి ఇళ్లు కట్టిస్తాం, షేర్లకు డబ్బులిస్తాం చెప్పి రూ.1,50,000లు ఇవ్వాల్సిన వారికి రూ. 8,25,000లు ఇప్పించి, తిరిగి వారి నుంచి రూ.4 లక్షలు తమ కమీషన్‌గా తీసుకున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో నలుగురి నుంచి రూ. 16 లక్షలు వసూలు చేశారన్నారు. భూమికి ఇచ్చిన పరిహారంలో 10 శాతం, ఉద్యోగం వద్దన్న వారికి రూ.3 లక్షలు ఇప్పించి తిరిగి వారి నుంచి రూ.1,50,000 అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారులు కనీసం విచారణకు ఆదేశించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. జిందాల్ చెరలో ఉన్న రైతుల భూముల్ని చట్టప్రకారం రైతులకు అప్పగించాలని కోరారు.

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎన్నికలు రేపు

దత్తిరాజేరు: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎన్నికలు ఈనెల 15న గజపతినగరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంఘ తాలూకా అధ్యక్షుడు గేదెల నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా కె.రాజ్‌కుమార్, పరిశీలకుడిగా వి. రాంబాబు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి, గజపతినగరం మండలాల్లో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు ఎన్నికలో హాజరుకావాలని కోరారు.

గురుకుల పాఠశాలకు వంద పరుపులు



విద్యార్థినులకు పరుపులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో గల మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల (బాలిక) విద్యార్థినులకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వంద పరుపులను ఆదివారం అందజేశారు. ముందుగా విద్యార్థినులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు కొల్లు రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా
పని చేయాలి



మాజీ ఎమ్మెల్యేతో రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ బమ్మిడి అప్పలనాయుడు

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ కోసం మరింత కష్టపడి పని చేయాలని రాష్ట బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా ఎంపికైన బమ్మిడి అప్పలనాయుడుకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సూచించారు. అదిష్టానం ప్రకటించిన రాష్ట్ర కమిటీలో తనకు చోటు దక్కడానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యేను ఆదివారం విజయనగరంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను కూడా కలసి ఆశీర్వాదం పొందారు.